డీసీహెచ్ఎల్ డైరెక్టర్లకు చుక్కెదురు

చెక్ బౌన్స్ కేసులను ఎదుర్కోవాల్సిందేనన్న హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రుణ బకాయిల చెల్లింపు నిమిత్తం బ్యాంకర్లకు చెల్లని చెక్కులు ఇచ్చి మోసగించినందుకు చెక్ బౌన్స్ కేసులను ఎదుర్కోవాల్సిందేనని దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డీసీహెచ్ఎల్) డైరెక్టర్లకు హైకోర్టు స్పష్టం చేసింది. డీసీహెచ్ఎల్ దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రుణ పరిష్కారానికి నేషనల్ కంపెనీస్ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) అనుమతి ఇచ్చినా ఈ కేసును కొట్టివేయడం సాధ్యం కాదని హైకోర్టు తేల్చిచెప్పు.. ఆ కంపెనీ డైరెక్టర్లు వెంకట్రామిరెడ్డి, వినాయక్ రవిరెడ్డి పిటిషన్లను కొట్టివేసింది. ఐబీసీ చట్టం కంపెనీలకే తప్ప వ్యక్తులకు రక్షణ కల్పించడం లేదని, అందువల్ల పిటిషనర్లు చెక్ బౌన్స్ కేసులను ఎదుర్కోవాల్సిందేనని జస్టిస్ కే లక్ష్మణ్ తెలిపారు.

ఆదిబట్ల మాజీ చైర్‌పర్సన్‌కు రూ.లక్ష జరిమానా

నాలుగు వారాల్లో చెల్లించాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడంతోపాటు వాస్తవాలను దాచిపెట్టి న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించారంటూ ఆదిబట్ల మాజీ చైర్‌పర్సన్ కే ఆర్తికపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పనికిమాలిన పిటిషన్ వేసినందుకు బాధ్యత వహించాలంటూ ఆమెకు రూ.లక్ష జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని నాలుగు వారాల్లోగా లీగల్ సర్వీసెస్ అథారిటీకి జమ చేయాలని ఆదేశించింది. ఫిబ్రవరి 9న జరిగిన విశ్వాస పరీక్షలో ఆర్తిక ఓడిపోవడంతో కొత్త చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం మార్చి 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ ఆర్తిక హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ టీ వినోద్‌కుమార్ పై తీర్పు ఇచ్చారు.

నార్కో టెస్ట్‌కు రెడీ

లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం

ఫోన్ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు

నాతోపాటు ముఖ్యమంత్రి రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావాలి

భట్టి, పొంగులేటి, ఉత్తమ్ ఫోన్లను ట్యాపింగ్ చేయలేదని సీఎం ఒప్పుకోవాలి

దేశంలోని ప్రతి ప్రతిపక్ష నాయకుడి ఫోన్ ట్యాపింగ్ అవుతున్నది

కావట్లేదని చెప్పే దమ్ము కిషన్‌రెడ్డికి ఉందా?

ట్యాపింగ్‌పై ఆధారాలుంటే కోర్టులో నిరూపించాలి: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నేతలు పదేపదే ఆరోపిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు స్పష్టంచేశారు. ఇందుకు అవసరమైతే నార్కో, లై డిటెక్టర్ పరీక్షలకు తాను సిద్ధంగా ఉన్నానని, తనపై నిత్యం ఆరోపణలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనతోపాటు లై డిటెక్టర్, నార్కో అనాలసిస్ పరీక్షకు రావాలని సవాల్ చేశారు. శుక్రవారం ఒక న్యూస్ చానల్ నిర్వహించిన 'క్రాస్‌ఫైర్' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు తన ఫోన్ ను, ఇతర ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. ట్యాప్ చేయడం లేదని చెప్పే దమ్ము, ధైర్యం సీఎం రేవంత్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి ప్రతిపక్ష నాయకుడి ఫోన్లను పెగాసెస్ సాఫ్ట్‌వేర్ ద్వారా కేంద్రం ట్యాప్ చేయిస్తున్నదని ఆరోపించారు. అలా చేయడం లేదనే దమ్ము, ధైర్యం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఉన్నదా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ హయాం నుంచే ట్యాపింగ్

నాడు ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్ ఫోన్ ట్యాపింగ్‌పై మాట్లాడిన మాటలను టీవీ స్టూడియో వేదికగా కేటీఆర్ ప్రసారం చేశారు. 2010 మేలో నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వివరాలు వెల్లడించారు. 9 వేల కాల్స్, మెయిల్స్ 2013లో ఎలా ట్యాప్ చేశారో వివరించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల ఫోన్లను టాప్ చేస్తున్నదని నాడు పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శంకర్‌రావు ఆరోపించారని గుర్తుచేశారు.

బహిరంగ సవాల్‌కు సిద్ధమేనా?

'ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదని నిరూపించుకునేందుకు గన్‌పార్క్ అయినా, మరేదైనా బహిరంగా వేదికమీదైనా నేను చర్చకు సిద్ధం. మీరు లైడిటెక్టర్ పరీక్షను ఓపెన్‌గా లైవ్ టీవీలో పెట్టండి. అది వద్దనుకుంటే నార్కో అనాలసిస్ అయినా ఫర్వాలేదు. ఈ రెండు పరీక్షలకు మీరు ఎక్కడికి, ఎప్పుడు రమ్మంటే నేను సిద్ధం. నాకు ఏ ట్యాపింగ్‌తో సంబంధం లేదు. కాంగ్రెస్ నుంచి రేవంత్‌రెడ్డి, బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి నాపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ప్రజలముందు నా చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు ఏ పరీక్షకైనా సిద్ధం. మీరు సిద్ధమేనా?' అని కేటీఆర్ సవాల్ విసిరారు.

> ఫోన్ ట్యాపింగ్‌పై నీకు సత్తా ఉంటే, నీ ప్రభుత్వానికి దమ్ముంటే ఆధారాలతో సహా కోర్టుముందు నిలబెట్టు. తప్పు చేసినవాడిని శిక్షించు. ప్రభుత్వం నీది కదా? నిన్నెవడు ఆపుతున్నాడు? -కేటీఆర్

ఆధారాలుంటే కోర్టుకు ఇవ్వండి

'ప్రతి ప్రభుత్వంలో ఉన్న నిఘా వ్యవస్థలు సంఘ విద్రోహ శక్తులను నిరోధించడానికి ట్యాపింగ్ చేస్తుంటాయని, అయితే, ఇట్లాంటి వ్యవస్థను దుర్వినియోగం చేస్తే ఎవ్వరైనా శిక్షార్హులేనని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడకముందు ఎన్నో దుర్ఘటనలు జరిగాయని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్క ఘటనైనా జరిగిందా? అని ప్రశ్నించారు. ప్రతిరోజూ మీడియాకు లీకులు ఇస్తున్న లీకువీరుడికి ఈ అంశం మీద ప్రెస్‌మీట్ పెట్టే దమ్ము లేదని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ మీద ఒక్క అధికారిక ప్రకటనైనా వచ్చిందా? అని ప్రశ్నించారు. ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేస్తే.. ఎవరు, ఎలా, ఎప్పుడు చేశారో ఆధారాలతో సహా కోర్టులో చెప్పాలని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఒకనాడు డీజీపీగా ఉన్నారని, ప్రస్తుత డీజీపీ రవిగుప్తా హోం సెక్రటరీగా పనిచేశారని, ఇప్పుడు ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న శివధర్‌రెడ్డి నాడు ఇంటెలిజెన్స్ డీజీగా పనిచేశారని, సజ్జనార్ ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేశారని, అయితే ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారో ఆధారాలుంటే కోర్టులో ఇవ్వాలని సూచించారు.

మీ మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయడం లేదా?

తన పాలనపై నమ్మకం లేని సీఎం రేవంత్‌రెడ్డి, తన మంత్రివర్గంలోని మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. 'రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలోని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి, ఉత్తమ్ ఫోన్లతోపాటు ప్రతిపక్షాల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారా? లేదా? అనేది లై డిటెక్టర్ టెస్టులో చెప్పాలి. ఆ ధైర్యం రేవంత్‌రెడ్డికి ఉన్నదా? లై డిటెక్టర్ టెస్టుకు నాతోపాటు కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి రావాలి. ముగ్గురం ఒకేచోట కూర్చుందాం. కడిగిన ముత్యంలా బయటికి వస్తా. నేనేం తప్పు చేయలేదు కాబట్టి, నాకు ఆ విశ్వాసం ఉన్నది. వారిద్దరికీ అదే విశ్వాసం ఉంటే వారు కూడా టెస్టు చేయించుకోవాలి' అని సవాల్ చేశారు.

9 ఎంపీ స్థానాలు గెలుస్తాం

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 9 నుంచి 12 ఎంపీ స్థానాలు కచ్చితంగా గెలుస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఎజెండానే తెలంగాణ అని, తెలంగాణ చుట్టూనే తమ పార్టీ రాజకీయం ఉంటుందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తులో కూడా భద్రంగా, బ్రహ్మాండంగా ఉంటుందని, తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని, అనేకమంది నాయకులను తయారుచేస్తారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామీణ ప్రాంతంలో బలంగా ఉన్నదని తెలిపారు. వీళ్లందరి పాత్ర కూడా ఉన్నదా? వీళ్లకేం తెలియకుండానే జరిగిందా? అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌కు చెందిన ఒక సామాజికవర్గాన్ని బదనాం చేస్తున్నారని మండిపడ్డారు.

అందుకే లీగల్ నోటీసులు ఇచ్చా

తనకు ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదని చెప్తుంటే, మంత్రులు, ముఖ్యమంత్రి సొల్లు మాటలు మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఏ తప్పూ చేయని నేనెందుకు భయపడాలి? అందుకే వారికి లీగ ల్ నోటీసులు ఇచ్చా. పరువునష్టం దావా వేశా. బాధ్యతల్లో ఉన్నవాళ్లు ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా? నాకూ కుటుంబం ఉన్నది, పిల్లలు ఉన్నారు. తప్పు చేయలేదని చెప్పడానికి నిప్పుల మీద నడవాలా?' అని ప్రశ్నించారు. ఈ కేసులో నిజంగా ఆధారాలు ఉంటే రేవంత్‌రెడ్డి బయటపెట్టాలని, నిందితులను శిక్షించాలని పేర్కొన్నారు. ఎన్నిరోజులు ఇంకా ఈ దాగుడుమూతలు అని ప్రశ్నించారు. వందరోజుల్లో ఏ పనులు చేయలేదు, టాపిక్ డైవర్ట్ న్ కోసం ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకుంటున్నారని మండిపడ్డారు. రెండు లక్షల రుణమాఫీ చేయలేక, నీళ్లు, కరెంటు ఇచ్చే దమ్ములేక పీఆర్ స్టంట్‌లు చేస్తున్నారని మండిపడ్డారు.

డమ్మీ అభ్యర్థులను నిలబెడుతున్నారు

రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లడానికి బాటలు వేసుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కోసమే డమ్మీ అభ్యర్థులను నిలబెడుతున్నారని, వాటిలో మల్కాజిగిరి, సికింద్రాబాద్, కరీంనగర్ వంటి పలు నియోజకవర్గాలు ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చాలా బలహీనంగా ఉన్నదని చెప్పారు. బీజేపీ ఓటు కోసం రాముడిని అడ్డం పెట్టుకుంటున్నదని విమర్శించారు. రాజకీయాల్లో కుల, మతాల ప్రభావం ఉండదని చెప్పారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన భువనగిరి పార్లమెంటు సన్నాహక సమావేశంలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ తదితరులు

కేంద్రంలో మెజారిటీ ఎవరికీ రాదు

- మన ఎంపీలతో ఢిల్లీలో చక్రం తిప్పగలమని ధీమా
- ప్రశ్నార్థకంగా ఫార్మాసిటీ, ఫాక్స్‌కాన్
- భూమి ఇచ్చినా ప్రయోజనం సున్నా
- పారిశ్రామిక అభివృద్ధితోనే 'రియల్ ఎస్టేట్' పైపైకి
- హామీలపై కాంగ్రెస్ నేతలను నిలదీయాలని కార్యకర్తలకు పిలుపు
- రాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తున్నదని విమర్శ
- ఇబ్రహీంపట్నంలో కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, ఏప్రిల్12: పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకీ సృష్టమైన మెజారిటీ వచ్చే అవకాశం లేదని, బీఆర్ఎస్ ఎంపీలను ఎక్కువ మందిని గెలిపిస్తే కేంద్రంలో చక్రం తిప్పవచ్చని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం బొంగళూరు సమీపంలోని ప్రమిద గార్డెన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన.. 'బీఆర్ఎస్ ప్రభుత్వం పంచభక్ష పరమాన్నా లు కలిపిపెట్టినా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తినలేని పరిస్థితిలో ఉన్నది. హైదరాబాద్ చు ట్టూ ప్రతిష్టాత్మకమైన పరిశ్రమలను ఏర్పాటు చేయటానికి మేం అన్నీ సిద్ధం చేసినా రేవంత్ సర్కారు చేత కానితనం వల్ల అవన్నీ వెనక్కి వెళ్లే పరిస్థితి వచ్చింది' అని తెలిపారు. ప్రము ఖ ఫాక్స్‌కాన్ కంపెనీకి భూమి సేకరించి అందించామని, రైతులను ఒప్పించి వేల ఎకరాల భూమిని ఫార్మాసిటీ కోసం సేకరించామ ని వెల్లడించారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల అవి ప్రశ్నార్థకంలో పడ్డాయని దుయ్యబట్టారు. పరిశ్రమలను పెద్దమొత్తంలో ఏర్పాటు చేస్తే, అంతే మొత్తంలో రియల్ ఎస్టేట్ వ్యాపా రం పుంజుకుంటుందని వివరించారు. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ సమస్య కూడా తీరుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పింఛను, రూ.500 బోనస్‌తో ధాన్యం కొనుగోళ్లు అమలు చేశాకే ఓట్లు అడగాలని సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. సర్కారు చేతగానితనం వల్ల కరెంటు కోతలు ఏర్పడ్డాయని, వేల ఎకరాల పంటలు ఎండిపోయాయని వెల్లడించారు. మిషన్ భగీరథ పథకాన్ని సరిగా అమలు చేయకపోవటంతో రాష్ట్రంతో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ సర్కారు ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి మంగళం పాడుతుందని ఆరోపించారు. ఓట్ల కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీలపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాముడి పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీ.. పదేండ్ల పాలనలో ధరలను విపరీతంగా పెంచి పేదల నడ్డి విరిచిందని ఆరోపించారు. తాము యాదగిరిగుట్ట ఆలయాన్ని పునర్నిర్మించినా, దాన్ని అడ్డం పెట్టుకొని ఏనాడూ ఓట్లు అడగలేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశ్, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయసమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, జడ్పీటీసీ జంగమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సోంపూర్‌లో వర్షానికి దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలి
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటల పరిశీలన

కోటగిరి/వర్ని, ఏప్రిల్ 12: వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి, వర్ని, చందూర్ మండలాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి చేతికొచ్చిన వరి పంట దెబ్బతిన్నదని, రైతుల బాధ చూస్తుంటే ఒక రైతుగా తాను తట్టుకోలేకపోతున్నా అని చెప్పారు. వ్యవసాయాధికారులు సర్వే చేసి పంట నష్టం వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని సూచించారు. చేతికొచ్చిన పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని పోచారం డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వచ్చే పెట్టుబడిదారులకు ఓటేసి మోసపోవద్దని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌కు వెళ్లి వ్యాపారులు, వినియోగదారులను ఓటు అభ్యర్థించారు.

చేవెళ్ల నుంచే ఎన్నికల శంఖారావం

- నేడు సాయంత్రం 5 గంటలకు బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ
- పాల్గొననున్న కేసీఆర్.. భారీ జనసమీకరణకు కసరత్తు

రంగారెడ్డి, ఏప్రిల్ 12 (నమస్తేతెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల వేదికగా శనివారం ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న మొదటి బహిరంగసభ కావడంతో నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సభ విజయవంతానికి కృషిచేస్తున్నారు. 2 లక్షలకు పైగా జనసమీకరణకు పార్టీ శ్రేణులు కసరత్తుచేస్తున్నాయి. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ సభ ద్వారా కేసీఆర్ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపనున్నట్టు తెలుస్తున్నది. చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట గులాబీ ఫ్లెక్సీలు, జెండాల తోపాటు ప్రజలు దూరం నుంచి సభను వీక్షించేందుకు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

షెడ్యూల్‌కు ముందు నుంచే దూకుడుగా

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందు నుంచే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ.. గులాబీ దళాన్ని ఎన్నికలకు సన్నద్ధం చేసేలా బీఆర్ఎస్ పార్టీ కసరత్తును ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నైరాశ్యంలో ఉన్న పార్టీ క్యాడర్‌లో జోష్ నింపేలా.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ అగ్రనేతలు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలను నిర్వహించారు. చేవెళ్లతోపాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, భువనగిరి, మల్కాజిగిరి పార్లమెంటు స్థానాలతో రంగారెడ్డి జిల్లాకు ఉన్న అనుబంధంతో కేసీఆర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో అధినేత కేసీఆర్ అనేక దఫాలుగా సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన గెలుపు వ్యూహాలపై సమాలోచనలు చేశారు. అందరి నేతల ఏకాభిప్రాయం మేరకు

కేసీఆర్ పర్యటన నందర్భంగా సభా వేదికను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల జనరల్ స్థానంలో బీసీ సామాజికవర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను వ్యూహాత్మకంగా బరిలో ఉంచారు. అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన మరుసటి రోజు నుంచే కాసాని జ్ఞానేశ్వర్ నియోజకవర్గాల వారీగా సమావేశాల్లో పాల్గొనడమేకాకుండా ముఖ్యనేతలు, కార్యకర్తలను కలుస్తున్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ సమావేశాల్లో అన్నీతానై వ్యవహరిస్తున్నారు. కాసాని గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిస్తున్నారు.

కేసీఆర్ స్పీచ్‌పై సర్వత్రా ఆసక్తి

చేవెళ్ల వేదికగా కేసీఆర్ చేయనున్న ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సభ ద్వారా కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను కేసీఆర్ ప్రజలకు వివరించనున్నారు. కాంగ్రెస్ పాలనలో నెలకొన్న కరువు, సాగు, తాగునీటి సమస్యలు, వివిధ వర్గాల ప్రజానీకం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించనున్నారు. ఇప్పటికే కేసీఆర్ జనగామ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ప్రచారసభలో కాంగ్రెస్‌తోపాటు విభజన హామీలను అమలు చేయక, రాష్ట్రానికి ప్రాజెక్టులేవీ ఇవ్వక వివక్షను చూపిన బీజేపీని నిలదీసేలా కేసీఆర్ ప్రసంగం సాగనున్నట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్, బీజేపీల మధ్య లోపాయికారీ ఒప్పందాలను ప్రజలకు వివరించడంతోపాటు గత పదేండ్ల బీఆర్ఎస్ పాలన తీరును పోల్చిచూసి లోక్‌సభ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ఈ వేదికపై నుంచి కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నారు. చేవెళ్లలో బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల తీరుపై ఈ సందర్భంగా కేసీఆర్ ప్రజలకు కర్తవ్యబోధ చేయనున్నట్లు సమాచారం. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ జనరంజక పాలనను ప్రస్తావిస్తూనే.. తెలంగాణ పట్ల తనకున్న భావోద్వేగ బంధాన్ని ఆవిష్కరించి ప్రజలను ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు.

- 'కాసాని'కి బీసీ వర్గాల సంపూర్ణ మద్దతు

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు బీసీ వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్నదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని ఎల్లమ్మబండ ముదిరాజ్ సంఘం చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని ఎమ్మెల్యే గాంధీకి ఆయన నివాసంలో కులపెద్దలు అందజేశారు. కార్యక్రమంలో బాల్‌రాజు, శ్రీనివాస్, కనకయ్య, సత్యనారాయణ, రాములు, నర్సింహ, జంపయ్య, వెంకటేశ్, రమణ, మల్లేశ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు దమ్ముంటే..

మొదటిపేజీ తరువాయి...

సత్తా చూపాల్సిన సమయం వచ్చిందని వారు అభిప్రాయపడుతున్నారు. మహేశ్వరం మండలం సరిగిరిపురం గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డికి అనుకూలంగా సోషల్ మీడియాలో ఆయన తరచూ పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఓ సెల్ఫీ వీడియోతో సదరు కాంగ్రెస్ నాయకుడు కుల కుంపటిని రాజేశాడు. బీసీ నేతలను ఉద్దేశించి మాట్లాడుతూ.. బీసీ అభ్యర్థిని ఎలా గెలిపించుకుంటారో చూస్తామని పరోక్షంగా హెచ్చరించారు. సమాజంలో అత్యధికంగా ఉన్న బీసీలు, బీసీ నేతలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన మోహన్‌రెడ్డి అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడంపై బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరికి అద్దం పడుతున్నట్టుగానే ఉన్నాయని బీసీ నేతలు మండిపడుతున్నారు.

బీసీలను బరిలో నిలిపిన బీఆర్ఎస్

చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో ప్రధానంగా ముక్కోణపు పోటీ నెలకొన్నది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు రెడ్డి సామాజికవర్గానికి చెందినవారిని తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. రంజిత్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వగా, కొండావిశ్వేశ్వర్‌రెడ్డిని బీజేపీ తన అభ్యర్థిగా ప్రకటించింది. బీఆర్ఎస్ మాత్రం బీసీ సామాజికవర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను బరిలోకి దింపింది. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో కాసాని బీసీల అభ్యున్నతికి విశేష కృషిచేశారు. 96 కులాల బీసీ నేతగా రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరున్న ఆయనకు కేసీఆర్ అవకాశం కల్పించారు